ప్రజాశక్తి
బుధవారం 4 అక్టోబర్ 2023
5
అల్లూరి సీతారామరాజు



## మహిళా డిగ్రీ కళాశాల గెస్ట్ లెక్చరర్ పోస్టులకు
# 10లోగా దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాశక్తి -అరకులోయ రూరల్:** అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి వివిధ గెస్ట్ లెక్చరర్ పోస్టలకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఈనెల 10లోగా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు స్థానిక మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్ రామకృష్ణ తెలిపారు. ఆంగ్లము, తెలుగు, హిందీ, గణితము, రసాయన శాస్త్రము, భౌతిక శాస్త్రము, జువాలజీ, కామర్స్, హిస్టరీ, రాజనీతి శాస్త్రము, కంప్యూటర్ అప్లికేషన్ తదితర పోస్టులకు సంబంధించి గెస్ట్ లెక్చరర్ పోస్టుల నియామకం చేపట్టనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో పిజి డిగ్రీలో 55శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని, పిహెచ్‌డి, నెట్, ఎపి సెట్ అర్హత ఉన్న అభ్యర్థులకు నియామకాల్లో ప్రాధాన్యత ఇస్తారన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఉక్కు రక్షణ బహిరంగ సభను
# జయప్రదం చేయండి



ముంచంగిపుట్టులో వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న కిల్లో సురేంద్ర, ఇతర నేతలు

**ప్రజాశక్తి-పెదబయలు :** విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు సిపిఎం ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర బైక్‌యాత్ర ముగింపు సందర్భంగా ఈనెల 5న కూర్మన్నపాలెంలో నిర్వహించే బహిరంగసభను జయప్రదం చేయాలనీ ల సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు బోండా సన్నిబాబు పిలుపునిచ్చారు. మంగళవారం పెదబయలులోని సిపిఎం కార్యాలయంలో ఉక్కు రక్షణ బహిరంగ సభ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాడి, ప్రాణాలను త్యాగం చేసి సాధించుకున్న ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కును కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కట్టబెట్టాలని చూస్తే సహించేది లేదన్నారు. మరోపోరాటం చేసైనా స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామన్నారు. ఇందులోభాగంగా నిర్వహించే ఉక్కు రక్షణ బహిరంగసభను విజయవంతం చేయాలని కోరారు.

**ముంచింగిపుట్టు:** ఉక్కురక్షణ బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కిల్లో సురేంద్ర పిలుపునిచ్చారు.మండల పర్యటనలో భాగంగా మండల సిపిఎం కార్యాలయం వద్ద బహిరంగ సభ వాల్‌పోస్టర్లను మండల నాయకులతో కలిసి ఆవిష్కరించారు, ఈ సందర్భంగా జి.నారాయణ అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో సురేంద్ర మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా మొదటి నుంచి సిపిఎం పోరాటం చేస్తోందన్నారు ఈనెల 5న నిర్వహించే ఉక్కు రక్షణ బహిరంగసభకు పార్టీ పోలిట్‌బ్యూరో సభ్యులు సీతారాం ఏచూరి, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, సిహెచ్.నర్సింగరావు, కె.లోకనాథం, ఇతర ముఖ్యనేతలు హాజరౌతారన్నారు. అధికసంఖ్యలో కార్మికులు, ప్రజలు తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నేతలు కొర్ర త్రినాధ్ పి.భీమరాజు, ఎంఎం శ్రీను, శంకరరావు, లైకోన్, పి రామదాసు, కె.డొంబ్రు పాల్గొన్నారు.

# మంత్రి రజనికి సమస్యలతో స్వాగతం



మంత్రి రజనికి వినతిపత్రం ఇస్తున్న సిహెచ్‌డబ్ల్యులు

**ప్రజాశక్తి -అనంతగిరి** : ఏజెన్సీలో రెండురోజుల పర్యటనకు వచ్చిన రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనికి స్థానికులు సమస్యలతో స్వాగతించారు. మంగళవారం అనంతగిరి హరిత రిసార్ట్స్‌కు వచ్చిన ఆమెకు ఐటిడిఎ పిఒ వి.అభిషేక్, అరకు ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ, ఎంపిపి శెట్టి నీలవేణి పుష్పగుచ్ఛాలను అందజేసి సాదరంగా స్వాగతించారు.హరిత హిల్ రిసార్ట్స్‌లో కాసేపు విశ్రాంతి తర్వాత అరకులో పర్యటించారు.

**సమస్యలపై పలువురి వినతి**

అరకు పర్యటనలో మంత్రి రజనికి సిహెచ్‌డబ్ల్యులు, ఆశాలు సమస్యలతో స్వాగతించి, వినతిపత్రం అందజేశారు. ఎనిమిదేళ్లకు పైగాసేవలు అందిస్తున్న తమ సేవలను గుర్తించి సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా ప్రమోట్ చేయాలని వినతిపత్రం అందించారు.ఆశాలతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నా వేతన చెల్లింపులో తేడా ఉందని, కేవలం రూ.మూడు వేలనెలసరి వేతనంతో జీవనం ఎలాగని గోడు వెల్లబుచ్చుకున్నారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని భరోసానిచ్చారు.అనంతగిరి ఆసుపత్రిని 30 పడకలకు అప్‌గ్రేడ్‌చేసి, వైద్యసేవలను మెరుగుపరచాలని, అలాగే పోస్టుమార్టం ఇక్కడే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలనిఎంపిపి శెట్టి నీలవేణి మంత్రికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు షేక్. మదీనా. వైసిపి మండలాధ్యక్షుడు ఆర్. స్వామి పాల్గొన్నారు

# వన్యప్రాణులను వేటాడితే కఠినచర్యలు

**ప్రజాశక్తి- అనంతగిరి రూరల్ :** వన్యప్రాణులను వేటాడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అనంతగిరి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ దుర్గారావు హెచ్చరించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ అటవీ జంతువులను వేటాడి చంపే వారిపై వన్యప్రాణులు సంరక్షణ చట్టం-1972 ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. గత వారం లక్ష్మీపురం గ్రామానికి చెందిన ముగ్గురు యువకులు వన్య ప్రాణులను వేటాడి తినడమే కాకుండా. యూట్యూబ్‌లో పెట్టారన్నారు. యూట్యూబర్లను వన్యప్రాణుల చట్టం ప్రకారం అరెస్టు చేశామన్నారు.ఉడుము, కారు కోడిని పట్టి, చంపి వండుకు తినడంతోపాటు దాన్ని వీడియో తీసి గ్రూపుల్లో వైరల్ చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. వన్యప్రాణులను రక్షించే బాధ్యత అందరిపై ఉందని, ఇప్పటికైనా వన్యప్రాణుల వేట మానుకోవాలని హితవు పలికారు.

# మహిళలకు టైలరింగ్ శిక్షణ సర్టిఫికెట్ల పంపిణీ



సర్టిఫికెట్లను అందజేస్తున్న రోటరీ ప్రతినిధులు

**ప్రజాశక్తి -అరకులోయ రూరల్:** రోటరీ క్లబ్ విశాఖపట్నం సంస్థ సహకారంతో టైలరింగ్‌లో శిక్షణ పొందిన వందమంది మహిళలకు మంగళవారం ఆదివాసీ గిరిజన సంఘం భవనంలో గిరి బాల నేస్తం క్లబ్ జిల్లా కన్వీనర్ వివి జయ అధ్యక్షతన సర్టిఫికెట్లను రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ డిఎం.రావు, సంస్థ సభ్యులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా రోటరీ ప్రెసిడెంట్ డిఎం రావు మాట్లాడుతూ.అన్ని రంగంలో మహిళలు ముందు ఉండాలన్నారు. కుట్టుశిక్షణ పొందిన మహిళలు స్వయంఉపాధితో ఆర్థికస్వావలంభన సాధించాలన్నారు. మహిళలంతా గ్రూప్‌గా ఏర్పడి కటింగు, స్టిచ్చింగ్, మగ్గం వర్క, కంప్యూటర్ నైపుణ్యం ఇంగ్లిషు రాయడం, మాట్లాడం నేర్చుకోవాలని, దీనికి తమవంతు సహాయ సహకారం అందిస్తామన్నారు. రోటరీ క్లబ్ విశాఖపట్నం కమ్యూనిటీ చైర్మన్ మణిమాల మాట్లాడుతూ మహిళలు పెయింటింగ్స్, మట్టి కళాఖండాలు, కెమెరా మెకింగ్, నైపుణ్యం నేర్చుకుంటే సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో శ్యాంశేఖర్, రోటరీ క్లబ్ సభ్యులు అశోక్ జైన్, ట్రైనింగ్ టీచర్ కిల్లో భాగ్యవతి, కమిటి మెంబర్లు కౌసల్య, నిర్మల, వసంత రాధిక, రమాలక్ష్మి, సహనాభి పాల్గొన్నారు.

## • కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా •

# బ్లాక్ డే

కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చ, కేంద్ర కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపుమేరకు బ్లాక్ డే కార్యక్రమంలో భాగంగా మంగళవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు.
(ప్రజాశక్తి- విలేకర్ల యంత్రాంగం)




చింతూరు ఐటిడిఎ వద్ద నిరసన

**చింతూరు :** బ్లాక్ డే సందర్భంగా చింతూరు ఐటిడిఏ ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పోడియం లక్ష్మణ్ మాట్లాడుతూ రైతు చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం సందర్భంగా 2021 అక్టోబర్ 3న ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్‌లో కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కొడుకు ఆసిస్ మిశ్రా నలుగురు రైతుల్ని ట్రాక్టర్‌తో తొక్కించి, కాల్పులు జరిపి చంపడం దుర్మార్గమన్నారు. అయినా ఇంతవరకు తండ్రీ కొడుకుల్ని ఇద్దరినీ అరెస్ట్ చేయకపోవడం దారుణమన్నారు. కేంద్ర మంత్రి అజయ్ మిశ్రాను వెంటనే బర్తరఫ్ చేయాలని, ఆసిస్ మిశ్రాను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సహాయ కార్యదర్శి స్వామి, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

**అడ్డతీగల :** బ్లాక్ డే కార్యక్రమంలో భాగంగా వై.రామవరం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.శాంతిరాజు మాట్లాడుతూ రైతులు, పేదలు కార్మికులు, సామాన్య ప్రజల సమస్త ప్రయోజనాలను నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తుందన్నారు. మోడీ ప్రభుత్వ తొమ్మిదేళ్ల కాలంలో దాదాపు లక్షల కోట్ల రూపాయల రుణాలను కార్పొరేట్లకు మాఫీ చేశారన్నారు. ఢిల్లీ రైతాంగ పోరాటం సందర్భంగా మోడీ ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. నాటి హామీలను అమలు చేయాలని, కార్మికులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు గడుతూరి, మల్లికార్జునరావు, ఆశావర్కర్స్ యూనియన్ నాయకులు కె.వీరలక్ష్మి, జె.నూకరత్నం, పి.పండమ్మ, ఎస్.గంగాదేవి, డి.పొట్టమ్మ, రైతులు పాల్గొన్నారు.

**అరకులోయ** : కేంద్రంలోని కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల కార్మిక వర్గానికి తీవ్రమైన నష్టం జరుగుతోందని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జె.భగత్‌రాం మండిపడ్డారు. మంగళవారం స్థానిక జిసిసి సోప్ యూనిట్ ఆవరణలో బ్లాక్ డే నిరసన చేపట్టారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, కార్మిక చట్టాలు సంస్కరించి, యజమాన్యానికి అనుకూలంగా లేబర్‌కోడ్‌లుగా రూపొందించి, పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులను నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు పెరుగుతున్న . ధరలకు అనుగుణంగా జీతాలు పెరగడం లేదని, అలాగే కార్మికులకు పని భద్రత, సామాజిక భద్రత లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యపోరాటానికి సిద్ధపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు సింహాద్రి, రామచందర్, పద్మ, కమంద్ పాల్గొన్నారు.

**చింతపల్లి :** లఖింపూర్ ఖేరి నిందితుడు, బిజెపి మంత్రి అజయ్ మిశ్రాను తొలగించి, శిక్షించాలని సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ నిరంకుశ విధానాలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.

.2021 అక్టోబర్ 3న జరిగిన లఖింపూర్‌ఖేరి ఘటనకు రెండేళ్లు పూర్తయిన సందర్భంగా నిందితులను శిక్షించడంలో కేంద్రం తాత్సారానికి నిరసనగా చింతపల్లి మండల కేంద్రంలో కార్మికులతో కలిసి కళ్ళకు నల్ల రిబ్బన్లు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. వ్యవసాయ సంక్షోభాన్ని పెంచిన మోడీ మతోన్మాద ప్రభుత్వాన్ని గద్దెదించి దేశాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు అర్జున్, పట్టాలనాయుడు, రాజులమ్మ, లక్ష్మి పాల్గొన్నారు




అరకులోయలో ..



అడ్డతీగలలో..



చింతపల్లిలో...

# నేడు కిల్లోగుడలో జగనన్న సురక్ష వైద్యశిబిరం

**ప్రజాశక్తి,-డుంబ్రిగుడ:** కిల్లోగుడ పిహెచ్‌సి పరిధిలోని జైపూర్ జంక్షన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో బుధవారం నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం విజయవంతానికి అన్ని చర్యలు చేపట్టాలని ఐటిడిఎ పిఒ వి.అభిషేక్ ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని ప్రారంభిస్తారన్నారు. ఈ మేరకు అక్కడ జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.డిఎంహెచ్ఒ డాక్టర్ జమాల్ భాషా, జిల్లా ప్రత్యేకాధికారి రమేష్, ఎంపిడిఒ ఉషారాణి, ఎటిడబ్ల్యుఒ మల్లికార్జున రావు, కిల్లోగుడ వైద్యాధికారిణి కరుణ, ఎస్ఐ సంతోష్ కుమార్, అధికారులు, వైద్య సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ అభిషేక్

# శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

- నాటు వైద్యానికి దూరంగా ఉండాలి
- ప్రత్యేక వైద్య శిబిరంలో డాక్టర్ హిమబిందు

**ప్రజాశక్తి -సీలేరు**

శిశువుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ధారకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డికె. హిమబిందు గిరిజనులకు సూచించారు. పసర మందులు, నాటు వైద్యానికి దూరంగా ఉండాలని హితవుపలికారు. ధారకొండ పిహెచ్‌సి పరిధిలోని చింతగుప్ప, కొత్తూరు కోట గ్రామాల్లో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించారు. గ్రామంలో శిశువులు, గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల లోపు చిన్నారుల ఆరోగ్యంపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. శిశువులు, గర్భిణులు, బాలింతలకు వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే ఆసుపత్రికి వచ్చి మెరుగైన చికిత్స చేయించాలని సూచించారు. పసర మందులు, నాటు మందులను ఆశ్రయించి, వ్యాధి ముదిరిపోయిన చివరి క్షణంలో ఆసుపత్రికి తీసుకొస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనులు మూఢనమ్మకాల వల్ల వారి ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుందన్నారు. పీహెచ్సీలో 24 గంటలు వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారని, వారి సేవలను సద్వినియం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యంపై ఎవరూ అశ్రద్ధ చేయొద్దని, వ్యాధి సోకిన వెంటనే దారకొండ పిహెచ్‌సికి వస్తే వ్యాధి నిర్ధారణ చేసి మెరుగైన వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. ఈ నెల 6న గుమ్మిరేవుల వద్ద నిర్వహించే జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్ఈఓ.పోతురాజు, పీహెచ్ఎన్ రాణి, ఏఎన్ఎం మత్స్య కొండ, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.



చిన్నారికి వైద్యం చేస్తున్న డాక్టర్ హిమబిందు

# 21వ రోజుకు టిడిపి రిలే నిరాహార దీక్షలు

**ప్రజాశక్తి- రంపచోడవరం**

టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టును నిరసిస్తూ స్థానిక తెలుగుదేశం పార్టీ క్యాంప్ కార్యాలయం వద్ద బాబు కోసం మేము సైతం అంటూ మాజీ శాసనసభ్యురాలు వంతల రాజేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు 21వ రోజు మంగళవారం కూడా కొనసాగాయి. మాజీ ఎమ్మెల్యే సీతంశెట్టి వెంకటేశ్వరరావు దీక్షల్లో పాల్గొన్న వారికి పూల దండలు వేసి దీక్షను ప్రారంభించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కారం సురేష్ బాబు, పెంటపాటి అనంత మోహన్, ఈక నరసన్న దొర, జెఎస్. నగేష్, గొల్ల చంటిబాబు, అడబాల బాపిరాజు, వై నిరంజని దేవి, తీగల ప్రభ కార్యకర్తలు, పాల్గొన్నారు.

**అడ్డతీగల :** మండల కేంద్రంలోని సిద్ధి వినాయక ఆలయం పక్కన టిడిపి నాయకులు మంగళవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీతపల్లి జంక్షన్ నుండి అడ్డతీగల పురవీధులలో భారీ ర్యాలీ నిర్వహించి, దేవిగుడి సెంటర్లో మానవహారం చేశారు. రాక్షస పాలన పోవాలి, చంద్రబాబును విడుదల చేయాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు గొర్ల శ్రీకాంత్, పల్లాల రమణారెడ్డి, నాయకులు జర్ర వెంకటరమణారెడ్డి, జనసేన నాయకులు జయరాం, సాయి పాల్గొన్నారు.

**డుంబ్రిగుడ :** జగన్‌రెడ్డి దుష్ట ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు గిరిజన ప్రజానీకం సిద్ధంగా ఉన్నారని మాజీ మంత్రి కిడారి శ్రావణకుమార్ అన్నారు. చందబాబు అరెస్ట్‌కు నిరసనగా మంగళవారం మండలంలోని గుంటసీమ పంచాయతీ కేంద్రంలో రంగిలిసింగి, తూటంగి, గుంటగన్నెల పంచాయతీల తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా బాబుతో నేను నిరసనలో పాల్గొన్నారు. చంద్రబాబు విడుదలయ్యే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనతో గిరిజనాభివృద్ధి, సంక్షేమం అట్టడుగు స్థాయికి చేరుకుందన్నారు. అవినీతి రహిత పాలనాధ్యక్షుడిగా సేవలందించిన చంద్రబాబును స్కిల్‌స్కాంలో జైలుకు పంపి, ప్రజాస్వామ్యానికే మచ్చ తెచ్చిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు టి సుబ్బారావు పాల్గొన్నారు.



టిడిపి రిలేదీక్షల్లో పాల్గొన్న మాజీ మంత్రి కిడారి



ఆశ్రమ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపిపి కారం లక్ష్మి తదితరులు

# ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

## - ఎంపిపి కారం లక్ష్మి

**ప్రజాశక్తి- విఆర్.పురం**

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను తక్షణమే ప్రత్యేక డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని ఎంపిపి కారం లక్ష్మి డిమాండ్ చేశారు. మండలంలోని సోములగూడెం ఆశ్రమ పాఠశాలను స్థానిక సర్పంచ్ కారం బుచ్చమ్మతో కలిసి ఎంపిపి కారం లక్ష్మి మంగళవారం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమకచు నైట్ వాచ్‌మెన్, ఎఎన్ఎం, లేరని, ఏడాది నుండి మినరల్ వాటర్ ప్లాంట్ పనిచేయటం లేదని, 6, 7 తరగతుల విద్యార్థులకు హాస్టల్‌లో కరెంటు లేదని, రాత్రి సమయంలో దోమలు ఎక్కువగా కరుస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ నైట్ వాచ్‌మెన్, ఎఎన్ఎంను నియమించాలని, సీజనల్ వ్యాధుల పట్ల శ్రద్ధ చూపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ భాగ్యలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు వడ్లది రమేష్, ఆసు లక్ష్మయ్య, అకుజ రంగాచారి పాల్గొన్నారు.

# మెరుపు సమ్మెతో దిగొచ్చిన జిసిసి అధికారులు

## - హమాలీలకు పెండింగ్ ఎరియర్స్ చెల్లింపు

**ప్రజాశక్తి -చింతూరు**

పెండింగ్ ఎరియర్స్ చెల్లించాలని సిఐటియు ఆధ్వర్యాన జిసిసి హమాలీలు సోమవారం చేపట్టిన మెరుపు సమ్మెకు అధికారులు దిగొచ్చారు. ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్న ఎరియర్స్ రూ.1,77,000 చెల్లించారు. ఈ సందర్భంగా సిఐటియు రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ పోరాటం ద్వారా హక్కులు సాధించుకోవచ్చని తెలిపారు. పోరాటంలో విజయం సాధించి జిసిసి హమాలీలకు జిల్లా కమిటీ తరుపున అభినందనలు తెలియజేశారు.




క్రీడాకారులను అభినందిస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

# చదువుతో పాటు ఆటలపైనా శ్రద్ధ వహించాలి

**ప్రజాశక్తి-రంపచోడవరం**

ఏజెన్సీలోని విద్యార్థులు చదువుతోపాటు ఆటలపైనా దృష్టి సారించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని కులుమనీలిలో 15 వేల అడుగుల పర్వత శిఖరాన్ని అవరోధించిన మారేడుమిల్లి ఏకలవ్య మోడల్ రెసిడెన్షిల్ బాలికల పాఠశాలకు చెందిన కుంజాం సుస్మిత, కుర్ల సౌజన్య మంగళవారం సాయంత్రం ప్రాజెక్ట్ అధికారి వారి ఛాంబర్లో పిఒను కలిశారు. ఈ సందర్భంగా పిఒ వారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ త్వరలో ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించడానికి పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తామన్నారు. పిఒతో పాటు జిల్లా ఫారెస్ట్ అధికారి. జిజి.నరేంద్ర. సబ్ కలెక్టర్ శుభం బన్సల్, ఎఎస్‌పి జగదీష్ అడహళ్లి అభినందించి సర్టిఫికెట్ అందజేశారు. అలాగే జావిలిన్ త్రో జాతీయ పోటీలకు ఎంపికైన మడకం నాగలక్ష్మిని అభినందించారు. కార్యక్రమంలో ఈఎంఆర్ఎస్ ప్రిన్సిపాల్ అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయిలో సాధించిన సర్టిఫికెట్లు చూపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

# జాతీయ సదస్సుకు ఏకలవ్య విద్యార్థుల ఎంపిక

**ప్రజాశక్తి- మారేడుమిల్లి**

వచ్చే నవంబర్‌లో ఢిల్లీలో జరగబోయే జి 20 యువ మంథన్ జాతీయ సదస్సుకు మారేడుమిల్లి ఏకలవ్య పాఠశాల విద్యార్థులు మమత, నాగలక్ష్మి, లోవరెడ్డి ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రిన్సిపాల్ టి. అరుణకుమారి తెలిపారు. సెప్టెంబర్ 29న తెలంగాణ రాష్ట్రం మహబూబ్ నగర్ జిల్లా బాలానగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి జి20 యువ మంథన్ సదస్సుకు మారేడుమిల్లి ఏకలవ్య పాఠశాల నుండి 21 మంది విద్యార్థులు పాల్గొన్నారని, వారిలో ముగ్గురు విద్యార్థులు జాతీయ సదస్సుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరి ఎంపిక పట్ల అరుణకుమారి, రంపచోడవరం ప్రిన్సిపాల్ ఐ.విఠల్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

# అల్లూరి యువజన సంఘం జాతీయ కార్యదర్శులుగా వరలక్ష్మి, రాజు

**ప్రజాశక్తి-కొయ్యూరు, రాజవొమ్మంగి**

జాతీయ అల్లూరి యువజన సంఘం కార్యదర్శులుగా కొయ్యూరు మండలానికి చెందిన శ్యామలా వరలక్ష్మి, రాజవొమ్మంగి మండలానికి చెందిన సోమిరెడ్డి రాజు ఎన్నికయ్యారు. సోమవారం అడ్డతీగలలో జరిగిన సంఘం జాతీయ మహాసభలో 60 మందితో నూతన కార్యవర్గం ఏర్పడినట్లు సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పడాల వీరభద్రరావు తెలిపారు. ఇంకా కొయ్యూరు మండలం నుండి జాతీయ కార్యవర్గ సభ్యులుగా కొప్పన సత్యనారాయణ, మాకాడ బూరుగులయ్య, కోన సత్యనారాయణ, అనిమిరెడ్డి అప్పలకొండ, కాకర చిన్నారావు ఎన్నికైనట్లు పేర్కొన్నారు. మరి కొంతమందిని కూడా కార్యవర్గంలోకి తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుదాస్

## వార్డెన్ల దురుసు ప్రవర్తన సరికాదు

### - ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రభుదాస్

**ప్రజాశక్తి -పాడేరు** : జిల్లా కేంద్రంలోని డిగ్రీ కాలేజీ విద్యార్థుల బాలుర1, 5 హాస్టల్స్ సందర్శనకు వెళ్లిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా నాయకుల పట్ల దురుసుగా ప్రవర్తించిన వార్డెన్‌లపై తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు కె.ప్రభుదాస్ డిమాండ్ చేశారు. మంగళవారం పాడేరులో నిర్వహించిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ ప్రత్యేక సమావేశంలో పలు అంశాలపై చర్చించి, భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, సోమవారం గాంధీ జయంతి సెలవు కావడంతో డిగ్రీ బాయ్స్ హాస్టల్,1,5 సందర్శనకు వెళ్లిన ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ నాయకుల పట్ల వార్డెన్లు దురుసుగా ప్రవర్తించడంతోపాటు ఎబివిపి తప్ప, ఇతర విద్యార్థి సంఘాల విషయం తమకు తెలియదని, అయినా విద్యార్థి సంఘాలు తమ వద్దకు రావద్దని తగాదాకు దిగడం దుర్మార్గమన్నారు. గిరిజన విద్యార్థుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ సంఘం పట్ల వార్డెన్ల అనుచిత ప్రవర్తన సరికాదన్నారు. దీనిపై అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఇటువంటి ఘటనలు పునరావృతమైతే ఆందోళన తప్పదని హెచ్చరించారు.కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చిన్నారావు జీవన్ కష్ణ మరియు జిల్లా నాయకులు కార్తీక్ మధ్య రాజు, సింహాద్రి ఏసుబాబు ధనలక్ష్మి పాల్గొన్నారు.



కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటులో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

## 'లయన్స్' సౌజన్యంతో కంప్యూటర్ ల్యాబ్

**ప్రజాశక్తి -అరకులోయ రూరల్:** విశాఖపట్నం లయన్స్ క్లబ్ ఛారిటబుల్ ట్రస్ట్ సహకారంతో స్థానిక శారదా నికేతన్ పాఠశాలకు ఆరు కంప్యూటర్లతో ల్యాబ్ ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా ప్రొఫెసర్ లయన్ ఎన్‌వివిఎన్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, గిరిజన ప్రాంతంలోని పేద విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించడమే లక్ష్యంగా కంప్యూటర్ ల్యాబ్‌ను ఏర్పాటు చేశామని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.విద్య, వైద్యం, రక్తదాన శిబిరాల నిర్వహణకు లయన్స్ క్లబ్ ఎపుడు సహకారం అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా తమ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటుచేసిన లయన్స్ క్లబ్ ప్రతినిధులకు శారదా నికేతన్ హెచ్‌ఎం ఎస్.చిరంజీవులు, స్కూల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ గవర్నర్ లయన్స్ క్లబ్ సభ్యులు డి సూర్యప్రకాష్, వైస్ డైరెక్టర్ గవర్నర్ లయన్ పి చంద్రశేఖర్, మేనేజింగ్ ట్రస్టీ లయన్ దుర్గ ఆనంద్, జోన్ చైర్మన్ లయన్ వివి నాయుడు, సెక్రటరీ లయన్ ఎం రామారావు. పాల్గొన్నారు.

## రైతునేస్తం పురస్కారానికి బంగారు ఝాన్సీ ఎంపిక

**ప్రజాశక్తి -మధురవాడ** : ప్రతిష్టాత్మకమైన పద్మశ్రీ డాక్టర్ ఐవి.సుబ్బారావు రైతునేస్తం పురస్కారానికి నగరానికి చెందిన మిద్దె తోట నిర్వాహకులు బంగారు ఝాన్సీ ఎంపికైనట్టు పద్మశ్రీ పురస్కార గ్రహీత, రైతునేస్తం ఎడిటర్ యడ్లపల్లి వెంకటేశ్వరావు ప్రకటించారు.

# పలుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష


పాడేరులో మందులు అందజేస్తున్న ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు

**ప్రజాశక్తి -యంత్రాంగం**

**పాడేరు:** స్పెషలిస్ట్ వైద్యసేవలతో ప్రజల ఆరోగ్య రక్షణకు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రభుత్వం నిర్వహిస్తోందని ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు అన్నారు. మంగళవారం మండలంలోని సలుగు పంచాయతీ సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఇప్పటి వరకు గిరిజనుల ఆరోగ్యాన్ని ప్రభుత్వాలు పట్టించుకోని పరిస్థితుల్లో ఇంటింటికి వెళ్లి అనారోగ్య సమస్యలను గుర్తించి, వారికి స్పెషలిస్ట్ వైద్యులతో సేవలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సలుగు పంచాయతీ సర్పంచ్ గెమ్మెలి అప్పలకొండ, ఎంపిటిసి సభ్యురాలు చిప్పాడ మీనా, వైసిపి మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, మాజీ మండల అధ్యక్షుడు కూడా సింహాచలం, జిల్లా ప్రధాన కార్యదర్శి సీదరి.మంగ్లన్న దొర, జిల్లా కార్యదర్శి సిరగం.దసమూర్తి, మండల ఉపాధ్యక్షుడు పసుపుల సత్యనారాయణ , సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు వణుగుబసవన్న దొర, రాము నాయుడు, దూసురి.గంగరాజు, సలుగు కృష్ణ, పాంగి.నవీన్, కొర్ర కృష్ణ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

**హుకుంపేట:** మండలంలోని శోభకోట మండల పరిషత్ పాఠశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని వైద్యాధికారులు, వైసిపి నేతలు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే చెట్టి ఫాల్గుణ ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, పేదల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి రేగం మత్యలింగం, ఎంపిపి కూడ రాజుబాబు, ఎంపిడిఒ అర్ వెంకటరావు, సర్పంచ్ పలాసి శశిభూషణం నాయుడు, వైసిపి జిల్లాఉపాధ్యక్షులు. పాంగి సింహాచలం, ఒంటుబు శామ్యూల్, కిల్లో రామకృష్ణ, రేగం శివరామకృష్ణ , వైద్యాధికారులు పాల్గొన్నారు.

**ముంచింగిపుట్టు:** మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ బాలురఆశ్రమం పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని జెడ్‌పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వయంగా బిపి, సుగర్, హెచ్‌బి, ఇతర రక్తపరీక్షలు చేయించుకున్నారు.ఈ సందర్భంగా గ్రామ సచివాలయాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో 45రోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో 553 మంది వైద్య సేవలు పొందారు. అత్యవసర వైద్య సేవలకు కెజిహెచ్‌కు ఐదుగురిని, డిహెచ్ రిఫరల్ ఏడుగురు, సిహెచ్ రిఫరల్ ఒకరిని చేశారు. కార్యక్రమంలో పాడేరు జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, డాక్టర్ సుమంత్, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ విజయ్ కుమార్, ఎంపిపి అరిసెల సీతమ్మ, అరబీరు జగబంధు, మండల వైసిపి అధ్యక్షుడు మల్లికార్జున పాల్గొన్నారు.


అనంతగిరి ఆరోగ్యశిబిరంలో పాల్గొన్న జెడ్‌పిటిసి గంగరాజు

**పెదబయలు రూరల్ :** పర్రెడ పంచాయతీకేంద్రంలో ఎంపిడిఒ ఎల్.పూర్ణయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్యసురక్ష వైద్యశిబిరంలో 364మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. జెడ్‌పిటిసి కె. బొంజుబాబు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు కె సురేష్ కుమార్, స్థానిక సర్పంచు సిహెచ్ రవిశంకర్, సర్పంచ్ ఫోరం మాజీ అధ్యక్షులు పి.సింహాచలం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ కిషోర్ డాక్టర్ విజయప్రసాద్, డాక్టర్ జెవి ప్రవీణ్,. డాక్టర్ అమత, డాక్టర్ కిషోర్, డాక్టర్ బి.సత్యారావు, ఇఒపిఆర్‌డి నర్సింగరావు, ఐసిడిఎస్ సూపర్వైజర్ సింహాచలం, ఎంఇఒ జోసెఫ్ పుష్ప పాల్గొన్నారు.

కొండిభ లో జగనన్న సురక్ష హాజరైన జడ్పిటిసి ఎంపిపి

**అనంతగిరి :** మండలంలోని కొండిభలో జగనన్న సురక్ష వైద్యశిబిరంలో జెడ్‌పిటిసి దీసరి. గంగరాజు. ఎంపిపి శెట్టి.నీలవేణి పాల్గొన్నారు. స్పెషలిస్ట్ వైద్యులతో నిర్వహించే వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ఎవివి. కుమార్, సిడిపిఒ సంతోషకుమారి, ఆర్ఐ. శంకరరావు,సర్పంచ్. పున్నమ్మ వైద్యాధికారులు డాక్టర్ జ్ఞానేశ్వరి, అను పాల్గొన్నారు.

**రాజవొమ్మంగి :** ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పించేందుకు ఇంటి వద్ద ఉచిత వైద్యం అందించాలన్నదే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎంపిపి గోము వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని శరభవరం గ్రామంలో గ్రామ సర్పంచ్ లోతా రాజ్యలక్ష్మి ఆధ్వర్యాన మంగళవారం ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పిటిసి వడుగుల జ్యోతి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో లోకుల యాదగిరిశ్వరరావు, సర్పంచుల సమైక్య అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, వైద్యాధికారులు లిఖిత, యామిని ప్రియ, కొండపల్లి సర్పంచ్ కుంజం జగన్నాథం, ఎంపీటీసీ చంద్రు లోవలక్ష్మి, ఏపీవో సురేష్ కుమార్, పంచాయితీ కార్యదర్శి కిషోర్, సచివాలయ కన్వీనర్ పప్పుల పైడమ్మ, కోట వెంకటేష్ పాల్గొన్నారు.

**కొయ్యూరు :** జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ బడుగు రమేష్ అన్నారు. మండలంలోని అంతాడ గ్రామ సచివాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఎంపీడీవో లాలం సీతయ్య, సర్పంచి సుర్ల చంద్రరావుతో కలిసి ఎంపిపి ప్రారంభించారు.

**సీలేరు :** జీకే వీధి మండలం సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆశా కార్యకర్తలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో డాక్టర్ సౌమ్య ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటింటికి ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు వెళ్లి అనారోగ్య సమస్యలపై సర్వే నిర్వహించి, రోగులను గుర్తించారు. అనంతరం వైద్య అధికారి సౌమ్య మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువుల మరణాలపై అవగాహన కల్పించినట్లు చెప్పారు. సీలేరులో నిర్వహించిన ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎన్.త్రినాధ్, ఏఎన్‌ఎంలు బి.దేవి, కెవిఎన్.కుమారి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


కొయ్యూరు మండలం అంతాడలో వైద్య శిబిరం

## పక్కాగా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ

**ప్రజాశక్తి- పాడేరు:** జిల్లాలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పక్కాగా రూపొందించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. మంగళవారం విజయవాడ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం నుండి ప్రత్యేక ఓటర్ల సవరణపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పాడేరు కలెక్టరేట్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్, ఇతర ఎన్నికల అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనఆనరు.ఈ సందర్భంగారాజకీయ పార్టీలు సమర్పించిన క్లెయిమ్‌లు, అభ్యంతరాలు, మృతి చెందిన ఓటర్లు, డూప్లికేట్, బదిలీ చేయబడినఓటర్లు, నకిలీ ఓటర్ల జాబితాల వెరిఫికేషన్, ఎపిక్ కార్డ్ జనరేషన్, తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో సమీక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఒకే వ్యక్తి పేరున రెండు అంతకంటే ఎక్కువచోట్ల ఓటు ఉంటే తొలగించాలని సూచించారు. ఈ సందర్భంగా అల్లూరిజిల్లాలో ఓటర్ల జాబితా సవరణ ప్రగతిపైకలెక్టర్ సుమిత్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. ఫారం 6, ఫారం 7. ఫారం 8 సేకరణలపై వివరించారు. డూప్లికేట్ ఓట్లు, మతి చెందిన ఓటర్లను తొలగింపుపై వివరించారు. ఫారం 7 పెండెన్సీ 10.4 శాతం, ఫారం 8 పెండెన్సీ 5.07 శాతం ఉందని త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జె. శివశ్రీనివాసు, డిఆర్ఒ పి అంబేద్కర్ పాల్గొన్నారు.

## ఘనంగా ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం

**ప్రజాశక్తి -జి మాడుగుల** : హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.23 వేల ఇవ్వాలని గిరిజన కార్పొరేషన్ హమాలీల సంక్షేమ సంఘ (ఎఐటియుసి) మేస్త్రి పండుబాబు డిమాండ్ చేశారు. మంగళవారం అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడిన తర్వాత ఎఐటియుసి రెండవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక గోడౌన్ వద్ద ఎర్ర జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో పండుబాబు మాట్లాడుతూ హమాలీలకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించి. సాధారణ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాదమరణానికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు.

**ముంచింగిపుట్టు:** జిసిసి హమాలీల సమస్యలు పరిష్కరించి, 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని హమాలీల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు బి.బలరాం డిమాండ్ చేశారు. ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక జిసిసి గోదాం ఎదుట జెండావిష్కరణ చేశారు. హమాలీల సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేపట్టారు. కార్యక్రమంలో కన్వీనర్ పి.సుబ్బారావు, హమాలీలు కె.శివగణేష్, డి.లైకోన్, ఎస్.దాసు, పి.ప్రసాద్, ఎం.జగన్నాథం, కె.పొదళం, కె.బిస్నత్ పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లో చేరిన నేతలకు కండువాలు వేస్తున్న పిసిసి అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు

## కాంగ్రెస్‌లో పలువురి చేరిక

**ప్రజాశక్తి -హుకుంపేట:** హుకుంపేట మండలానికి చెందిన సమ్మరెడ్డి బాలకృష్ణ, సీసా రామారావు, బాబురావు మంగళవారం విజయవాడలోని ఆంధ్రభవనం, పార్టీ కార్యాలయంలో పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాహుల్‌గాంధీ ఆశయాలకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా హుకుంపేటలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ అరాచక పాలన అంతమొందించడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. అందరినీ సమన్వయం చేసుకొని ముందుకు తీసుకెళ్లడం ద్వారా పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా. ఏజెన్సీ ప్రాంతంలో హక్కులు, చట్టాల ఉల్లంఘన, సమస్యలపై రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు. వీరితోపాటు పట్టణంలోని సెవెన్ సీటర్ ఆటో రిక్షా యూనియన్ నాయకులు పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా, వారికి ఎపిసిసిఅధ్యక్షులు రుద్రరాజు యూనిఫామ్ దుస్తులను అందజేశారు.


రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

## సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి-రాజవొమ్మంగి :** గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి విడుదల చేసిన గ్రాంట్ నుండి మండలంలోని కొండపల్లి గ్రామంలో రూ.8లక్షలతో 3 సిసి రోడ్లు నిర్మాణానికి మంగళవారం ఎంపిపి గోము వెంకటలక్ష్మి, జెడ్పిటీసి వడుగుల జ్యోతి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కుంజం జగన్నాథం, సర్పంచుల సమైక్య మండల అధ్యక్షులు కొంగర మురళీకృష్ణ, వైసిపి నాయకులు దాట్ల వెంకటేశ్వరరాజు, చింతలపూడి వెంకట రమణ, కోటం వెంకటేష్, సరస్వతి, సన్యాసిరొర, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు.

## ఉక్కుపై కుట్రలు దారుణం

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** ప్రభుత్వ రంగంలో లాభాలతో నడుస్తున్న వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తున్న మోడీని, అతనికి మద్దతుగా నిలుస్తున్న పార్టీలను రానున్న ఎన్నికల్లో ఓడించాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన దీక్షలు మంగళవారానికి 913వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వైసిపి, టిడిపి, జనసేనలు చిత్తశుద్ధితో వ్యతిరేకించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న బిజెపికి మద్దతుగా నిలిచే పార్టీలకు ప్రజలు రానున్న కాలంలో బుద్ధిచెబుతారని హెచ్చరించారు. దీక్షల్లో క్లాప్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు అనిల్ కుమార్, సురేష్, కార్మికులు నారాయణమ్మ, కనకరాజు, లక్ష్మి, స్వర్ణ భారతి పాల్గొన్నారు.

## సమిష్టి కృషితో ఇళ్ల స్థలాలు సాధిద్దాం

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** సమిష్టి కృషితో జర్నలిస్టుల సొంతింటి కల నెరవేర్చుకొందామని విశాఖ అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ గౌరవ అధ్యక్షులు జి.జనార్ధనరావు, అధ్యక్షులు బి.రవికాంత్ పిలుపునిచ్చారు. సొసైటీ ఆధ్వర్యాన విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారంతో ముగిసిందన్నారు. సుమారు 800 మందికిపైగా అక్రిడేటెడ్ జర్నలిస్టులు సభ్యులుగా చేరారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉండటం కలిసి వచ్చే అంశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి యర్రా శ్రీనివాస్, సలహాదారులు పి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కె.పరుశురాం, సహాయ కార్యదర్శులు అనురాధ, చిట్టిబాబు, బందరు శివ ప్రసాద్, సీనియర్ జర్నలిస్టులు జార్జ్, హుస్సేన్, ప్రసాద్ పాల్గొన్నారు.

## చంద్రబాబు అవినీతి ముత్యం

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** చంద్రబాబు అవినీతి ముత్యమని వైసిపి మహిళా విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, శాసనమండలి సభ్యురాలు వరుదు కల్యాణి అన్నారు. మంగళవారం ఉదయం సిరిపురంలోని ఆమె క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో రూ.371 కోట్లు అవినీతి చేసి దొంగలా ఆధారాలతో సహా పట్టుబడి చంద్రబాబు జైలుకెళ్లారని తెలిపారు. ఆయనకు ఒత్తాసు పలకడంలో అర్థం లేదన్నారు.

## 22న జర్నలిస్టుల దసరా సంబరాలు

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్, ఎపి బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్టుల అసోసియేషన్‌ల సారథ్యంలో ఈ నెల 22న జర్నలిస్టుల దసరా సంబరాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు, అర్బన్ అధ్యక్షులు పి.నారాయణ్ తెలిపారు. మంగళవారం ఓ హోటల్‌లో ఫెడరేషన్ అర్బన్ కార్యవర్గ సమావేశం జరిగింది.

# విరగబడే వారిపై తిరగబడే చర్య !

### బాందేవపురం దళిత యువకునిపై దాడి కేసులో తక్షణ న్యాయం
### నగర పోలీస్ కమిషనర్‌కు ప్రశంసలు
### విశాఖ గ్రామీణంలో భూస్వామ్య, ఖాకీల జులుంపై చర్యలు
### ఎస్ఐ, ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్‌పై సర్వత్రా హర్షం

**ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో**

'పెత్తందార్లపై పేదల పోరాటం' - విశాఖ నగరం, గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కడ చూసినా కనిపించే కటౌట్లు ఇవి. ఇందులో ఎంత నిజం ఉందో అందరికీ తెలిసిందే. గ్రామాల్లో దళితులు, పేదలను వంచించే ఘటనలు నేటికీ కొనసాగుతున్నాయనడానికి విశాఖ జిల్లా పద్మనాభం మండలం బాందేవపురం గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనే నిదర్శనం. ఒక పెత్తందారుడి ఇంట్లో కోడిపుంజును దొంగిలించాడనే నెపం మోపి కేసుపెట్టి అదే గ్రామానికి చెందిన దళిత యువకుడు బాందేవపురం పాపును ఇద్దరు కానిస్టేబుళ్లు మద్యం పూటుగా తాగేసి చావబాదిన వైనం సభ్య సమాజం సిగ్గుతో తలదించుకునేలా చేసింది. ఎస్ఐకు విషయం తెలిసినా నిర్లక్ష్యం వహించడం దారుణం. 'ఇంకెక్కడి కుల వివక్ష, దళితులను ఎక్కడ అవమానంగా చూస్తున్నారు. ఆ రోజులు ఎప్పుడో పోయాయి. అంతా కలసిమెలసి జీవిస్తున్నారు' అంటూ పెత్తందారీ పోకడలను సమర్థించుకునేవారికి ఈ ఘటన చెంపపెట్టు కాగలదు. పోలీసులు పాలకవర్గాలు, గ్రామాల్లో పెత్తందార్ల చేతిలో ఆయుధాలు అన్న మాటలను నిజం చేసేలాగ పద్మనాభం పోలీస్ స్టేషన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్, ఇద్దరు కానిస్టేబుళ్లు వ్యవహరించారు. అయితే, పోలీసులంతా ఒకేలా లేరు అనేలా విశాఖ నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యర్ ఈ కేసులో వ్యవహరించిన తీరు అందరి చేతా శభాష్ అనిపించుకునేలా ఉంది. తాజా ఘటనలో దళిత యువకునిపై దాడి చేసిన వారిపై పోలీస్ కమిషనర్ సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు.


దళిత యువకునిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన వారిపై చర్యలు తీసుకున్న సిపి రవిశంకర్

**అసలింతకీ ఏం జరిగిందంటే..**

బాందేవపురం గ్రామానికి చెందిన ఇందుకూరు రాజబాబుకు చెందిన కోడిపుంజును అదే గ్రామానికి చెందిన పాపు, గాలి ఎర్నిబాబు దొంగిలించారంటూ గత నెల 29న పద్మనాభం పోలీసులకు ఫిర్యాదు అందింది. అప్పటి నుంచీ నిందితులను సాయంత్రం వేళ విచారిస్తున్నారు. ఆదివారం రాత్రి 10 గంటలకు నిందితులను పోలీసులు విడిచిపెట్టాల్సి ఉన్నప్పటికీ అలా చేయలేదు. అక్కడకు చేరుకున్న నిందితుల బంధువులనూ లోపలకు అనుమతించలేదు. ఆ రాత్రి సమయానే నిందితునిగా ఉన్న పాపు కేకలు, ఏడుపు వినిపించడంతో బంధువులు లోపలకు వెళ్లారు. అప్పటికే ఆయన కాలు విరిగి స్పృహ కోల్పోయి ఉన్నాడు. ఆయన్ని బంధువులు విజయనగరంలోని మహారాజా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పోలీసులు నిందితున్ని కొట్టారన్న విషయం తెలియగానే గ్రామంలోని కొంతమంది అక్కడకు వచ్చి స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. ఈ క్రమంలోనే కానిస్టేబుళ్లు సతీష్. శ్రీనివాస్ గోడ దూకి పరారయ్యారు. క్రైమ్ ఎస్ఐ మల్లేశ్వరరావు ఈ విషయాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా ఉన్నారు. స్టేషన్ వద్ద నిందితుని బంధువుల ఆందోళన తీవ్రమవుతున్న విషయం తెలుసుకున్న క్రైమ్ డిసిపి నాగన్న, దిశా పోలీస్ స్టేషన్ ఎసిపి



పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న దళితులు (ఫైల్)

వివేకానంద వారితో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో పోలీసు కమిషనర్ వెంటనే స్పందించారు. దళిత యువకున్ని విచక్షణా రహితంగా చావగొట్టడం, తొమ్మిది నెలల క్రితం అతని కాలికి ఫ్యాక్చర్ కాగా ఇప్పుడిప్పుడే తగ్గుతున్న క్రమంలో ఖాకీలు ఆ కాలుపై 'థర్డ్' డిగ్రీ ప్రయోగించడంపై ఆగ్రహించారు. దొంగతనం కేసులో నిందితునిగా ఉన్న వ్యక్తిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి కాలు విరగ్గొట్టారని ప్రాథమిక విచారణలో తేలడంతో ఇద్దరు కానిస్టేబుళ్లపైనా, ఎస్ఐపైనా సస్పెన్షన్ చర్యలు తీసుకున్నారు. ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేశారు. సిఐ సన్యాసి నాయకుడుకు ఛార్జి మెమో ఇచ్చారు.

**కెవిపిఎస్ హర్షం**

బాందేవపురంలో దళిత యువకున్ని దొంగతనం కేసులో ఇరికించి, 'థర్డ్ డిగ్రీ' ప్రయోగంతో కాలు విరిగేలా చేసిన ఘటనపై విశాఖ నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యర్ స్పందించిన తీరును కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) స్వాగతించింది. ప్రస్తుత వ్యవస్థలో ఇలాంటి అధికారులు మార్పు కోసం ప్రయత్నించడం మంచి పరిణామమని ఆ సంఘం జిల్లా నాయకులు సుబ్బన్న, చిరంజీవి ఓ ప్రకటనలో మంగళవారం ప్రశంసించారు. గ్రామాల్లో పేదలపై ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయని, శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు భూస్వాములకు, గంజాయి మాఫియాలకు కొమ్ముకాస్తూ స్టేషన్లను అడ్డాగా మార్చేసి పేదలను హింసిస్తున్నారని తెలిపారు. రూ.5 వేలు ఇస్తే వదిలేస్తామంటూ పెత్తందార్లు బాందేవపురంలో పంచాయితీ నిర్వహించడం సరైన పద్ధతి కాదని, పేదవాడైన పాపు ఇవ్వనందున స్టేషన్‌లో పోలీసులచేత పెత్తందారులు దాడిచేయించారని, వారిపై కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

# హోరాహోరీగా అండర్ - 11 చెస్ పోటీలు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విశాఖ నగరంలో ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకూ పోర్టు స్టేడియంలో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జాతీయ స్థాయి అండర్ 11 చదరంగం పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. ఐదో రౌండ్ ముగిసే సరికి బాలుర విభాగంలో ఆన్ష్‌నందన్, సంజయ్, సాయిష్ అమోనకర్, మదేశ్‌కుమార్ ఐదు పాయింట్లతో ముందంజలో ఉన్నారు. ఆంధ్రాకు చెందిన హేమల్ వర్షన్, ఎ.అఖిల్‌ప్రసాద్ 4.5 పాయింట్లతో 9, 10 స్థానాల్లో కొనసాగుతున్నారు. బాలికల విభాగంలో హన్యాషా, వితస్తా కౌల్, ప్రతీతి, ఆంధ్రాకు చెందిన త్రిపురాంబిక ఐదు ప్లాయింట్లుతో ప్రతిభ కనబరిచారు. ఆంధ్ర చెస్ అసోసియేషన్ సభ్యులు శర్మ, భీమారావు, మణికంఠరావు, శ్రీకాంత్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఈ టోర్నమెంట్‌కు రవిచంద్రన్ ఇంటర్నేషనల్ ఆర్బిటర్‌గా వ్యవహరిసున్నారు.


రోడ్డు మలుపుల్లో దట్టంగా పెరిగిన చెట్ల కొమ్మలు

## రోడ్ల పక్కన పొదలను తొలగించరూ...

**ప్రజాశక్తి-కూనవరం :** మండలంలోని ప్రధాన రహదారుల పక్క, రోడ్డు మూల మలుపుల వద్ద ప్రమాదకరంగా ఉన్న పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు. వర్షా కాలం వచ్చిన తరువాత రోడ్డుకు ఇరువైపుల ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగాయి. మలుపుల వద్ద వాహనాలు కనపడకుండా ముళ్ల పొదలు రోడ్లను కమ్ముకున్న పరిస్థితి నెలకొంది. దీంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. వీటిపై సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాహన చోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలను తొలగించాలని కోరుతున్నారు.

## 'ఉద్యోగాల పేరిట వైసిపి నేతల డబ్బులు వసూలు'

**ప్రజాశక్తి -కొయ్యూరు :** ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కొయ్యూరు మండలంలో పలువురు గిరిజన నిరుద్యోగుల నుండి వైసీపీ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నారని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు జి.లక్ష్మణ్ ఆరోపించారు. మంగళవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వైసీపీ నేతలు డబ్బులు వసూలు చేస్తున్న విషయం స్థానిక ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మికి తెలిసే జరుగుతుందా అని ప్రశ్నించారు. వైసీపీ నేతలు నిరుద్యోగుల నుండి డబ్బులు వసూలు చేస్తున్న అంశంపై ఎమ్మెల్యే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల జనసేన నేతలు పాల్గొన్నారు.

## కొండరెడ్ల సంతపై ఐటిడిఎ నిర్లక్ష్యం తగదు

**ప్రజాశక్తి-కూనవరం :** కొండరెడ్ల సంతపై ఐటిడిఎ అధికారులు నిర్లక్ష్యం వహించడం తగదని మండలంలోని కూటూరు పంచాయతీ సర్పంచ్ బొగ్గ వెంకమ్మ పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలో పర్యటించిన సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో జరిగే సంత కొండరెడ్డి వాసులకు అతిపెద్దదని, అటువంటి సంతలో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారని పేర్కొన్నారు. గతంలో ఉన్న షెడ్డు రేకులు పగిలిపోయి ప్రమాదకరంగా ఉన్నాయని, వాటిని వెంటనే ఆదునికీకరించి సంతలో సదుపాయాలు వెంటనే కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పాయం సీతారామయ్య, మాజీ ఎంపిపి మేకల నాగేశ్వరరావు, స్థానికులు పాల్గొన్నారు.

## 14 దొంగతనం కేసులు ఛేదన

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇటీవల కాలంలో జరిగిన 14 ఇంటి దొంగతనం కేసులను పోలీసులు ఛేదించారు. ఆయా కేసుల్లో 14 మందిని అరెస్టు చేశామని, 70 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని విశాఖ క్రైమ్ డిసిపి గంధం నాగన్న తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం పోలీస్ కమిషనర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఆ కేసుల వివరాలు వెల్లడించారు. ఇటీవల కాలంలో జరిగిన దొంగతనం కేసులను తమ సిబ్బంది ఎంతో చాకచక్యంగా ఛేదించారని తెలిపారు. గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో 1, ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో 2, భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో 2, గోపాలపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో 1, పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో 1, కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 3, ఎంవిపి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో 3, పిఎం పాలెం పరిధిలో 1 ఛేదించినట్టు తెలిపారు. ఆ దొంగతనాలకు సంబంధించి రూ.46 లక్షల విలువ గల 70 తులాల బంగారం, ఒక సుజుకి యాక్సెస్ వాహనం, రూ.6 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇప్పటికి 14 మందిని అరెస్టు చేశామని, 8 మందిని అరెస్ట్ చేయాల్సి ఉందని ఆయన తెలిపారు. కేసులను ఛేధించిన పోలీసు సిబ్బందిని రివార్డులతో అభినందించారు.